ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది : 26-08-2025 సమయం : 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. శాండ్ బజార్ ఏర్పాటుతో అందరికీ ఇసుక అందుబాటులోకి వస్తుందని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం అవుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు.
2. తెలంగాణాలో యూరియా కొరతపై అపోహలు కలిగించేలా కాంగ్రెస్ ప్రభుత్వం, బి.ఆర్.ఎస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డి.కె.అరుణ ఆరోపించారు.
3. దేశంలోనే మొట్టమొదటిసారి రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి.
4. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని ఆలోచనలను దేశ, విదేశాల ప్రజలతో పంచుకునే మన్ కీ బాత్ ప్రసంగం ఈ నెల 31న ఉదయం 11 గంటలకు ఆకాశవాణిలో ప్రసారం అవుతుంది.

సాండ్ బజార్

సాండ్ బజార్ ఏర్పాటుతో అందరికీ ఇసుక అందుబాటులోకి వస్తుందని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం అవుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి జిల్లా ఆందోల్ లో తెలంగాణ రాష్ట్ర మైనింగ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శాండ్ బజార్‌ను ఈ రోజు మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రజలకు నాణ్యమైన ఇసుకను సరసమైన ధరలో అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. దళారుల బెడద లేకుండా, పారదర్శక పద్ధతిలో, నేరుగా ప్రజలకు ఇసుక అందించేందుకు ప్రభుత్వం సాండ్ బజార్లను ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి 20 కిలోమీటర్లకు ఒక సాండ్ బజార్ ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

సంగారెడ్డి

బండి సంజయ్

విద్యా రంగం అభివృద్ధికి ప్రధానమంత్రి మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఈ రోజు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో పదో తరగతి విద్యార్థులకు మోడీ గిఫ్ట్ పేరుతో సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యారంగం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తోందన్నారు.

**(సౌండ్ బైట్: కేంద్ర మంత్రి బండి సంజయ్)**

రాజన్న సిరిసిల్ల

యూరియా కొరత : ఎంపీ డీకే అరుణ

తెలంగాణలో యూరియా కొరతపై రైతుల్లో అపోహలు కలిగించేలా కాంగ్రెస్ ప్రభుత్వం, BRS నాయకులు కేంద్రంపై అసత్య ప్రచారాన్ని చేస్తున్నారని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు, BJP జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆరోపించారు. మహబూబ్ నగర్‌లో ఆకాశవాణి ప్రతినిధితో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే యూరియా కొరత ఏర్పడిందని ఆమె ఆరోపించారు. ఇతర రాష్ట్రాల్లో ఎరువుల కొరత లేదనీ, తెలంగాణలో మాత్రమే ఈ పరిస్థితి తలెత్తడానికి రాష్ట్ర ప్రభుత్వమే కారణమని పేర్కొన్నారు.

**(Byte: ఎంపీ డీకే అరుణ)**

పిటిసి Mahabubnagar

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:

దేశంలోనే మొట్టమొదటి ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన ఈ విశ్వవిద్యాలయంలో ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్తగా నాలుగు డిగ్రీ కోర్సులను ప్రవేశపెట్టినట్లు మైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జగన్మోహన్ రాజు వెల్లడించారు.

**(సౌండ్ బైట్: ప్రిన్సిపాల్ జగన్మోహన్ రాజు)**

పీటీసీ భద్రాద్రి కొత్తగూడెం

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలు

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా సూర్యాపేట జిల్లా, పెన్ పహాడ్ ఉన్నత పాఠశాలకు చెందిన మారం పవిత్ర ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా ప్రకటించే జాతీయ ఉత్తమ

ఉపాధ్యాయ అవార్డు కు రాష్ట్రవ్యాప్తంగా 150 మంది ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోగా, వారిలో సూర్యాపేట జిల్లాకు చెందిన మారం పవిత్రను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా 2025 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. సూర్యాపేట జిల్లా పెన్ పహాడ్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయురాలుగా ఆమె పనిచేస్తున్నారు.

నల్లగొండ

బీహార్ – సీఎం రేవంత్ రెడ్డి

ఓటర్ల జాబితాలో లోపాలను ఎత్తిచూపుతూ బీహార్‌లో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఓటర్ అధికార్ యాత్రలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. సుపాల్‌లో నిర్వహించిన పాదయాత్రలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీతో పాటు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి సహా పలువురు నాయకులు పాల్గొన్నారు.

డెస్క్

**BREAK**

ఆకాశవాణి ప్రాంతీయ వార్తలు వింటున్నారు. మరిన్ని Updates కోసం హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం "ఎక్స్" handle @ airnews_hyd ని ఫాలో అవండి. AIR News Hyderabad YouTube Channel కి సబ్ స్క్రైబ్ చేయండి.

పెన్షన్

ఉద్యోగుల హక్కు అయిన పాత పెన్షన్ విధానం - OPS సాధించేవరకు పోరాటం కొనసాగిస్తామని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు లింగాల రాజశేఖర్ అన్నారు.

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో పెన్షన్ సాధన కోసం తెలంగాణ ఉద్యోగుల జేఏసీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ 20 నుండి 30 సంవత్సరాల వరకు ప్రభుత్వ ఉద్యోగులుగా సేవలు అందించిన వ్యక్తులకు పెన్షన్ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

పిటిసి జి.మహేష్ ఆసిఫాబాద్ జిల్లా

కేంద్ర మంత్రి బండి సంజయ్

ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఓటర్ల జాబితా గురించి వ్యాఖ్యలు చేయడం ఓటర్లను అవమానించడమే అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆక్షేపించారు. పీసీసీ అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. కరీంనగర్లో విలేకరులతో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. పీసీసీ అధ్యక్షుడు ఓటర్ల జాబితా గురించి కాకుండా సీట్ల గురించి మాట్లాడాలని అన్నారు. ఎన్నికల ప్రమేయం లేకుండా తమ పార్టీ దేశం కోసం, ధర్మం కోసం పోరాడుతోందని మంత్రి పేర్కొన్నారు.

**(సౌండ్ బైట్)**

పిటిసి, కరీంనగర్

జనహిత యాత్ర

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజా పాలన సాగిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ పేర్కొన్నారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో నిన్న రాత్రి చేపట్టిన జనహిత పాదయాత్రలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో కలసి ఆమె పాల్గొన్నారు. జనహిత పాదయాత్ర ద్వారా రెట్టించిన ఉత్సాహంతో కాంగ్రెస్ కార్యకర్తలు పనిచేయాలని  సూచించారు.

వరంగల్ జిల్లా పి టి సి

అంగన్వాడీలు – పోషణ వాటికలు

జగిత్యాల జిల్లాలో ఎంపిక చేసిన 107 అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ వాటికలను ఏర్పాటు చేయనున్నారు. వీటిలో సేంద్రీయ పద్ధతిలో సహజ ఎరువులు ఉపయోగించి కూరగాయలను పండిస్తారని జిల్లా సంక్షేమశాఖ అధికారి డా. నరేష్ తెలియజేశారు.

**(బైట్: జిల్లా సంక్షేమ అధికారి డా.నరేష్)**

పిటిసి జగిత్యాల జిల్లా

**MANN KI BAAT**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని ఆలోచనలను దేశ, విదేశాల ప్రజలతో పంచుకునే మన్ కీ బాత్ ప్రసంగం ఈ నెల 31న ఉదయం 11 గంటలకు ఆకాశవాణిలో ప్రసారం అవుతుంది. ఇది ప్రతినెలా ప్రసారమయ్యే రేడియో కార్యక్రమంలో 125వ సంచిక. కాగా, ఈ కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్ మొత్తం నెట్వర్క్, AIR న్యూస్ వెబ్సైట్, కేంద్ర సమాచార, ప్రసార శాఖ YouTube ఛానెళ్లలో కూడా ప్రత్యక్ష ప్రసారం అవుతుంది. హిందీ ప్రసంగం ముగిసిన వెంటనే తెలుగు అనువాదం ప్రసారం అవుతుంది.

**NSD**

వాతావరణం

ఈ రోజు నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ఈ రోజు భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు, వరంగల్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. మిగిలిన జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది. అన్ని ప్రాంతాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

పీఎన్

ప్రీ ప్రైమరీ తరగతులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 21 పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ చెప్పారు. సెప్టెంబర్ 1 వ తేదీ నాటికి ఇందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నాలుగు ఏళ్లు నిండిన బాల బాలికలను ఈ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులలో చేర్పించేలా విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని తెలియజేశారు.

పిటిసి భద్రాద్రి కొత్తగూడెం

**CLOSING**

ఆకాశవాణి ప్రాంతీయ వార్తలు ఇంతటితో సమాప్తం. తిరిగి సాయంత్రం 6 గంటల 10 నిమిషాలకు ప్రాంతీయ వార్తలు వింటారు.